

రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

రోడ్డు పనులు చేపట్టాలి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు పనులు చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ క్రిస్టల్ విల్లాస్ వద్ద రోడ్డుపై గుంతలు పడి వాహనదారులకు ఇబ్బందికరంగా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ మేరకు గురువారం కార్పొరేటర్ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్

ఆలయ అభివృద్ధికి కృషిచేయాలి : శ్రవణ్‌కుమార్

వనస్థలిపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆలయ పాలకమండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషిచేయాలని భ్రమరాంబమల్లికార్జునస్వామి ఆలయ అధ్యక్షుడు దీపావళి శ్రవణ్‌కుమార్ అన్నారు. వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని ప్రసిద్ధ భ్రమరాంబమల్లికార్జునస్వామి ఆలయ కమిటీ పాలకమండలి సమావేశం గురువారం ఆలయ ప్రాగణంలో జరిగింది. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు దీపావళి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ ఆలయంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పాలకమండలి సభ్యులు తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో చౌదరి దివాకర్‌లింగం, సతీష్, మహేంద్ర, డీ.సతీష్, మల్లికార్జున్, వీరయ్యస్వామి, చంద్రమౌళి, నందీశ్వర్, శ్రీశైలం పాల్గొన్నారు.



లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనర్సింహుడికి కలశాభిషేకం

మన్సూరాబాద్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ జనప్రియ ఎన్‌క్లేవ్ పార్కులో వేద హవనం సహిత గజేంద్రమోక్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏకాదశి స్వాతి నక్షత్రమును పురస్కరించుని గురువారం లక్ష్మీనర్సింహస్వామికి విశేష కలశాభిషేకంను వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైదిక విజ్ఞాన ట్రస్టు, ధర్మరక్ష సంస్థ ఆధ్వర్యంలో జనప్రియ ఎన్‌క్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు. సాయంత్రం భద్రాచల ఆస్థాన వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యుల ప్రవచనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడికి ఘనస్వాగతం



శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద శివచరణ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నేతలు

మన్సూరాబాద్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డికి గురువారం శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఘనస్వాగతం లభించింది. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భాన్ చిబ్ నుంచి అధికారికంగా నియామకపత్రం అందుకుని గురువారం నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తరలివెళ్లిన రాష్ట్ర, ఎల్బీనగర్‌కు చెందిన యువజన, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా శివచరణ్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు.



బడంగ్‌పేట్ కురుమ సంఘం ప్రతినిధులు

బడంగ్‌పేట్ కురుమ సంఘం అధ్యక్షుడిగా సాయికుమార్

సరూర్‌నగర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ కురుమ సంఘం అధ్యక్షుడిగా గౌర సాయికుమార్ ఎన్నికయ్యారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా కడారి భిక్షపతి, కొండ్రు చంద్రయ్య, గౌర రాకేశ్‌కుమార్, గౌర కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా చిన్నరావుల రవీందర్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా దొడ్డి వెంకటేశ్, గౌర శ్రీనివాస్, కోశాధికారిగా గౌర శివకుమార్, సలహాదారులుగా గౌర సత్తెయ్య, దొడ్డి మల్లికార్జున్, దడిగ ఐలయ్య, గౌర రమాదేవిశ్రీనివాస్, గౌర సురేశ్, సభ్యులుగా దండ్ల మహేందర్, దడిగ రాఘవేంద్ర, కడారి నర్సింహ, గౌర వెంకటేశ్, గౌర కుమార్ తదితరులను ఎన్నుకున్నట్టు అధ్యక్షుడు సాయికుమార్ తెలిపారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం : ముత్తినేని



ఆస్పత్రి ఎండీ చైతన్యతో కలిసి మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ముత్తినేని వీరయ్య

మన్సూరాబాద్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రక్తాన్ని కృత్రిమంగా సృష్టించలేమని, అందుకే ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మన్సూరాబాద్‌లోని ప్రసిద్ధ్ హాస్పటల్ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముత్తినేని వీరయ్య ఆస్పత్రి ఎండీ జూకూరి చైతన్యతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. అంతకుముందు వారు కేక్ కట్ చేసి నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన..!

- ఎల్-1 దశలోనే పరిశీలనకు బ్రేక్.. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో 24వేల దరఖాస్తులు
- 5 నెలల్లో 3వేల దరఖాస్తుల పరిశీలనకే పరిమితం
- పెండింగ్‌లోనే 21వేల దరఖాస్తులు
- మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతోంది. దరఖాస్తుల పరిశీలన ప్రారంభించి దాదాపు 5నెలలు గడుస్తున్నా కేవలం మూడు వేల దరఖాస్తులను అధికారులు పరిశీలించి క్లియర్ చేసినట్లు తెలిసింది. ఇంకా సుమారు 21వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎల్-1 దశలోనే దరఖాస్తుల పరిశీలనకు బ్రేక్ పడుతున్నట్లు తెలుస్తోంది. ఎల్-1లో దరఖాస్తులను పరిశీలించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఫీజు చెల్లించేందుకు దరఖాస్తుదారులు సిద్ధంగా ఉన్నా.. అధికారులు సైట్ విజిట్‌కు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని పలువురు బాధితులు పేర్కొన్నారు. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో కార్యాలయం చుట్టూ తిరుగాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో భాగంగా సైట్ విజిట్ చేస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ తదితరులు(ఫైల్)

అధికారుల నిర్లక్ష్యంతోనే..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. మున్సిపల్ అధికారులు అందుబాటులో ఉన్నా ఆయా శాఖల అధికారులు మాత్రం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని 4గ్రామాల్లో మొత్తం 24వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటి పరిశీలన కోసం మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి నాలుగు టీంలను ఏర్పాటు చేశారు. 24వేల దరఖాస్తుల పరిశీలన బాధ్యతలను నాలుగు టీంలకు విభజించారు. ఎల్-1లో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు దరఖాస్తుదారుడి సైట్‌ను సందర్శించి కోర్టు కేసులు, ప్రభుత్వ భూమి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలి. ఎలాంటి సమస్య లేకపోతే వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అనంతరం ఎల్-2 టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారి క్లియరెన్స్ ఇవ్వగానే ఎల్-3 మున్సిపల్ కమిషనర్ ఓకే చేయగానే మార్కెట్ రేటు ప్రకారం ఎల్ఆర్ఎస్ ఫీజు ఆన్‌లైన్‌లో జనరేటు అవుతుంది. ఆ వెంటనే దరఖాస్తుదారుడికి ఫోన్ మెసేజ్ వెళ్తుంది. ఏదైన సమస్య ఉంటే మాత్రం అధికారులు ఆ దరఖాస్తులను హోల్డ్‌లో పెడుతున్నారు.

> ### సర్వేల కారణంగా ఆలస్యం..
>
> 
>
> మొదట ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన చురుకుగానే జరిగింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన చేస్తున్న అధికారులు, సిబ్బందికి సమగ్ర కటుంబ సర్వే వివరాలు కేటాయించడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో కొంత ఆలస్యం అయింది. ఎల్-3 పరిశీలనకు వచ్చిన వాటిని వెంటనే క్లియర్ చేస్తున్నాం. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుంది.
>
> \- రవీందర్‌రెడ్డి, కమిషనర్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ

ఎల్-1 అధికారుల వద్దనే బ్రేక్..

ఎల్-1లో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా దరఖాస్తుదారులతో కలిసి సైట్ విజిట్ చేయాలి. లేఔట్, ప్లాట్లకు సంబంధించి ఎలాంటి సమస్య లేకపోతే అక్కడే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అలా చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. విజిట్ చేసిన అనంతరం అప్‌లోడ్ చేయకపోవడంతో ఆ ప్రక్రియ ముందుకు వెళ్లడం లేదు. దాంతో ఎల్-1 అధికారుల వద్దనే బ్రేక్ పడుతుంది. పరిశీలన పూర్తి అయినా ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఎలాంటి మెసేజ్ రాకపోవడంతో పలువురు దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారు. ఎల్-1 అధికారుల నిర్లక్ష్యం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్-1 టీంలోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదని దరఖాస్తుదారులు పేర్కొన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

- అరుణ పతాకాలను ఎగురవేసిన నాయకులు

ఎల్బీనగర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు అరుణ పతాకాలను ఎగురవేశారు. ఎల్బీనగర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మన్సూరాబాద్‌లోని డబుల్ బెడ్రూం కాంప్లెక్స్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బాతరాజు నర్సింహ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా మన్సూరాబాద్, భగత్‌సింగ్‌నగర్, శంకర్‌నగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాలలో జరిగిన వేడుకల్లో సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గసభ్యుడు బాతరాజు నర్సింహ, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి విష్ణువర్ధన్‌రెడ్డి, సీపీఐ సరూర్‌నగర్ మండల సహాయ కార్యదర్శి కందుల సుధాకర్, పూజారి అనిత, వనస్థలిపురం డివిజన్ కార్యదర్శి బోయపల్లి రాములుగౌడ్, హయత్‌నగర్ మండల కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శులు అరుణ్, శోభన్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గసభ్యులు రమావత్ సక్రూనాయక్, శోభ, లింగస్వామి, శ్రీనివాస్, దుండిగల్ లక్ష్మి, కట్ట పార్వతమ్మ, యాదిరెడ్డి, విక్రమ్ పాల్గొన్నారు.



మన్సూరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బాతరాజు నర్సింహ

హయత్‌నగర్ : సీపీఐ హయత్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి హాజరై జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కన్న ముందు సీపీఐ ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సీపీఐ కార్మిక, కర్షక హక్కుల కోసం పోరాడిన చరిత్ర గల పార్టీ అని కొనియాడారు. తెలంగాణలో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ సీపీఐ అని కొనియాడారు. దున్నేవాడికే భూమి అంటు ఉద్యమించి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన పార్టీ సీపీఐ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి శ్రీదేవి, నర్సింహ, రాములమ్మ, వంశీవర్ధన్‌రెడ్డి, సక్రునాయక్, శోభన్, సుధాకర్, అరుణ్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవీంద్రాచారి

నగరానికి టిబెటియన్ల ర్యాలీ

సికింద్రాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చైనా నుంచి టిబెటియన్లకు స్వాతంత్ర్యం కావాలని కోరుతూ టిబెట్‌కు చెందిన టిబెటియన్ యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు చేపట్టిన ర్యాలీ గురువారం 36వ రోజు హైదరాబాద్‌కు చేరింది. ఈ ర్యాలీని సికింద్రాబాద్ ఎంజీరోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద ప్రముఖ మెజీషియన్ సామల వేణు, ప్రొఫెసర్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం నుంచి టిబెట్‌కు కొన్ని దశాబ్దాల నుంచి మద్దతు లభిస్తుందని, ఇందుకు కృతజ్ఞతగా బైక్ ర్యాలీ ప్రారంభించామని తెలిపారు. నవంబరు 22న అరుణాచల్‌ప్రదేశ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ 11 మంది సభ్యులతో 20వేల కిలోమీటర్లు తిరిగి ఢిల్లీలో ముగుస్తుందని తెలిపారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



అరవింద్‌రెడ్డి

హయత్‌నగర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : బీటెక్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగనూరుకు చెందిన గంట అరవింద్‌రెడ్డి(19) బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఫోన్లో ఎక్కువ మాట్లాడుతున్నావని, చాటింగ్ చేస్తున్నావని అరవింద్‌రెడ్డి తల్లి మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన అతడు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బుధవారం బయటకు వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తున్నారు.

దృష్టి మరల్చి రైతు సెల్‌ఫోన్ చోరీ

కొత్తపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దుండగులు దృష్టి మరల్చి వృద్ధ రైతు జేబులోని సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లిన సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండలం రంగాపూర్‌కు చెందిన కుకుడాల మాధవరెడ్డి(70) రైతు. అతడు తరచూ బైరామల్‌గూడలో పెద్దమొత్తంలో పశువుల దానా అమ్మే దుకాణంలో దానా కొనుగోలుకు వస్తుంటాడు. తర్వాత వాళ్లు అతడి ఇంటికి వాహనంలో దానా పంపుతుంటారు. ఈనెల 24న సాయంత్రం 6గంటలకు అతడు బైరామల్‌గూడకు వచ్చి, దానా బుక్‌చేసి సాగర్‌రింగ్ రోడ్డు వద్ద రోడ్డు దాటేందుకు వేచి ఉన్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని ముగ్గురు దుండగులు ఆటోలో అతడి వద్దకు చేరుకుని మాట్లాడడం మొదలు పెట్టి దృష్టి మరల్చి అతడి జేబులో ఉన్న రెడ్‌మీ 9ఏ సెల్‌ఫోన్ లాక్కుని అదే ఆటోలో వెళ్లిపోయారు. అతడూ తమ గ్రామానికి వెళ్లిపోయాడు. గురువారం సాయంత్రం బాధితుడు ఎల్బీనగర్‌కు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

సస్పెన్షన్‌కు గురైన మదర్ డెయిరీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకుని పోలీసులకు అప్పగించిన సెక్యూరిటీ సిబ్బంది

హయత్‌నగర్, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్ గురైన మదర్ డెయిరీ ఉద్యోగి గురువారం రాత్రి 8గంటలకు మదర్ డెయిరీ ముందర ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరికి చెందిన సంతోష్‌కుమార్, మోత్కూర్‌లో డిస్పాచ్ సెక్షన్లో పనిచేస్తున్నాడు. కాగా గత సంవత్సరం సంతోష్‌కుమార్‌ను హయత్‌నగర్ మదర్ డెయిరీకి బదిలీ చేశారు. అక్కడ బటర్ సెక్షన్లో పనిచేయాలని సంతోష్‌కుమార్‌ను ఆదేశించారు. పలు కారణాలతో చైర్మన్ మూడు రోజుల క్రితం సంతోష్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. అది తట్టుకోలేని అతడు తను సూసైడ్ చేసుకుంటానని లెటర్ రాసి జేబులో పెట్టుకున్నాడు. తన చావుకు చైర్మన్, ఎండీ, మరో ఉద్యోగి సామ మహిపాల్‌రెడ్డి కారణం అంటూ లెటర్ రాసి పెట్టాడు. ఒక వీడియో కూడా విడుదల చేసి పోలీసులకు పంపించాడు. దీంతో పోలీసులు బుధవారం అతన్ని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి 8గంటల సమయంలో మదర్ డెయిరీ వద్దకు వచ్చిన సంతోష్‌కుమార్ డెయిరీలోనికి వెళ్లడానికి ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. వెంటనే సంతోష్‌కుమార్ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను మీద పోసుకుని నిప్పంటించుకోవడానికి ప్రయత్నిస్తుండగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా హయత్‌నగర్ పోలీసులు అక్కడికి చేరుకుని సంతోష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై చైర్మన్ ని వివరణ కోసం సంప్రదించగా సంతోష్‌కుమార్ పనిచేయకుండా తప్పించుకొని తిరుగుతూ బ్లాక్మెయిలింగ్ పాల్పడుతున్నాడని తెలిపారు. శుక్రవారం పిలిచి మాట్లాడి సమస్యను సద్దుమణిగేలా చేస్తామని అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సరూర్‌నగర్ : మీర్‌పేట్‌లోని 11కేవీ జిల్లెలగూడ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మందమల్లమ్మ చౌరస్తా, టీకేఆర్ కమాన్, శక్తినగర్, అంబేడ్కర్‌నగర్, గాయత్రీనగర్, న్యూగాయత్రీనగర్, ఓల్డ్ గాయత్రీనగర్, డీఆర్ఆర్ హోమ్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని ఏఈ వెంకటయ్య తెలిపారు. అదేవిధంగా 11కేవీ జనార్దన్‌రెడ్డినగర్ ఫీడర్, 11కేవీ కేశవరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30గంటల నుంచి ఒంటి గంట వరకు టీఎస్ఆర్‌నగర్, ప్రశాంతిహిల్స్ రోడ్ నం.1,2, రాఘవేంద్రనగర్, మీర్‌పేట్ పోస్టాఫీస్, మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్, సీతాహోమ్స్, భూపేశ్‌గుప్తానగర్, గాయత్రీనగర్, శ్రీధర్‌కాలనీ, వివేక్‌నగర్, వెంకటేశ్వరకాలనీ, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని ఆయన చెప్పారు.

ప్రజాకవి కాళోజీకి పీవీ స్మారక పురస్కారం

- రేపు డాక్టర్ నలిమేళా భాస్కర్‌కు ప్రదానం
- హాజరు కానున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

బర్కత్‌పుర, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు స్మారక పురస్కారం 2024ను ప్రముఖ ప్రజాకవి, పద్మవిభూషణ్ దివంగత కాళోజీ నారాయణరావుకు ప్రదానం చేస్తున్నట్లు పీవీ నర్సింహారావు మెమోరియల్ ఫౌండేషన్ వెల్లడించింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫౌండేషన్ సలహాదారులు పద్మశ్రీ డాక్టర్ హనుమాన్ చౌదరి, ఆర్టీఐ మాజీ కమిషనర్ పి.విజయబాబు, విశ్రాంత ఐఏఎస్ ఎం.బాలలత, ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి అనిల్‌కుమార్ మాట్లాడారు. పీవీ నర్సింహారావు స్మారక పురస్కారం 2024 ప్రజాకవి కాళోజీ నారాయణరావు అనుచరుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమేళా భాస్కర్‌కు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గతంలో పీవీ నర్సింహారావు స్మారక పురస్కారం పద్మవిభూషణ్ రతన్‌నావల్ టాటా, దలైలామాకు అందజేయడం జరిగిందన్నారు. ఈనెల 28న రవీంద్రభారతిలో జరిగే అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, సురభి వాణిదేవి, అమెర్ అలీఖాన్, మాజీ ఎంపీ కె.వి.రామచంద్రరావు, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో న్యాయవాది శ్రీకర్ శర్మ, సూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశ్రీ డాక్టర్ హనుమాన్ చౌదరి

ఎస్సీ వర్గీకరణ అమలు చేయించడమే ఏకైక లక్ష్యం

- ఫిబ్రవరి 3న 'వెయ్యి గొంతులు-లక్ష డప్పులు' తరలిరావాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

అల్వాల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం 30 ఏళ్లుగా రాజీలేని పోరాటం చేశామని, మాదిగల పోరాటంలో న్యాయబద్ధతను గ్రహించి సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉందని చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. గురువారం అల్వాల్ లోతుకుంటలో ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటం వల్ల దక్కిన విజయ ఫలాలను అందుకునే సమయంలో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి మాల సామాజికవర్గంలోని కొంతమంది స్వార్థపరులు కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. ఆ కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత మాదిగ ప్రజల మీద ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకుల కుట్రలను ఎదుర్కోవడానికి ఫిబ్రవరి 3వ తేదీన మాదిగ కళానేతలతో వెయ్యి గొంతులు-లక్ష డప్పుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కొన్నేళ్లుగా సమాజ వికాసం కోసం మోగిన డప్పులు ఈసారి జాతి విముక్తి కోసం మోగబోతున్నాయన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడమంటే అంబేద్కరును వ్యతిరేకించడమే అవుతుందన్నారు. వెయ్యి గొంతులు- లక్ష డప్పులు కార్యక్రమంతో వర్గీకరణ వ్యతిరేకుల కుట్రలను తిప్పి కొడుతామన్నారు. డప్పులను సంకకు వేసుకొని లక్షలాదిగా మాదిగ బిడ్డలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాకారుడు ఏపూరి సోమన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నరేష్ మాదిగ, మచ్చ దేవేందర్, రాం బాబు, వెంకటస్వామి మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, జాతీయ ప్రధానకార్యదర్శి కోళ్ల శివ మాదిగ, బిక్షపతి మాదిగ, మహిళా రాష్ట్రనాయకురాలు లతమాదిగ, బైరవపోగు శివకుమార్‌మాదిగ, స్వామి మాదిగ, చిరంజీవి మాదిగ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

మలక్‌పేటలో హుక్కా పార్లర్‌పై పోలీసుల దాడి

- నలుగురి అరెస్టు

చాదర్‌ఘాట్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నిషిధిత హుక్కా పదార్థాలను విక్రయిస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్న హుక్కా పార్లర్‌పై మలక్‌పేట పోలీసులు సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడి జరిపారు. ఇందుకు కారకులైన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మలక్‌పేట ఎస్‌ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేటలోని పీవీఆర్ మాల్ పక్కనున్న కేఫ్ బ్లాక్ స్పాట్ పేరుతో నిర్వహిస్తున్న హుక్కా పార్లర్‌లో నిషేధిత హుక్కా పదార్థాలను అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లుగా అందిన సమాచారం మేరకు మలక్‌పేట పోలీసులు, సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. ఇందులో క్యాషియర్‌గా పనిచేస్తూ సబ్ ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తున్న పాతబస్తీ మొఘల్‌పుర నివాసి మహ్మద్ అజీమ్(24), అందులో పనిచేసే బీహార్ రాష్ట్రంలోని చోటిపాలి నివాసి అస్లాం హల్దోర్(40)లను అదుపులోకి తీసుకుని విచారించగా నిషేధిత హుక్కా పదార్థాలు బయటపడ్డాయి. వాటిని వాడుతున్న ఇద్దరు కస్టమర్లు చంచల్‌గూడ కాలాడేర నివాసులైన డిగ్రీ విద్యార్థులు ఎతేషామ్ మెహదీ(20), అజాన్ మెహదీ(20)లు పోలీసులకు పట్టుబడ్డారు. నిషేధిత హుక్కా పదార్థాలతో పాటు ఐదు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు మలక్‌పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన వ్యక్తులు, స్వాధీనం చేసుకున్న హుక్కా పదార్థాలు